మినీకథ

# ఒకే అవసరం

ఆరుపల్లి గోవిందరాజులు



ఆ దినం ఆఫీసు నుండి ఇల్లు చేరేసరికి ట్యూషన్‌లో ఉండవలసిన పిల్లలు వినోదంగా క్యేరమ్స్ ఆడుకుంటున్నారు. రోజా తోటలో మొక్కలకు నీళ్ళు పోయవలసిన గంగయ్యకి బదులు పెద్దమ్మాయి నీళ్ళు పోస్తుంది. వంట గదిలో వంట చేయవలసిన నీలాలుకి బదులు శ్రీమతి చిరుబురులాడుతూ అదో తరహా వంట సామానుల మ్యూజిక్‌తో వంట చేస్తుంది. అంతా అగమ్యగోచరంగా తోచి "వీళ్ళంతా స్ట్రయిక్ గాని డిక్లేర్ చేస్తారేమిటి"- అన్నాను. శ్రీమతి అదోలా చూస్తూ చీర నడుంకిబిగించి "యూనియన్ మనుష్యులకి పాకీవాడు రాక పోయినా. పాలవాడు తగలడకపోయి నా ముందు వచ్చే మాటలు ఇవే గదా" విసుక్కుంటూ అన్నది.

"సారీ మేడమ్! (ఆ పరిస్థితులలో అలా అనాలిమరి! ఎందుకంటే చేతిలో కాయగూరలు తరిగే కత్తిపీట ఉన్నది గనుక!) వీళ్ళంతా కనబడకపోతే అడిగానంతే!" తిరిగి వినయంగా అన్నాను.

'టీ'-అందిస్తూ "ఇదుగోండి. మీకేచెబుతున్నాను. ఈ పనివాళ్ళతో నే వేగలేక చస్తున్నాను. ఒకరోజు ఒకరి కూతురికి బాగులేదని; మరొకరోజు అయ్యకి కడుపునొప్పి వస్తే ఆసుపత్రికి వెళ్ళాలని మరొకరు మరొకరోజు చుట్టాలొచ్చారని పెళ్ళని పేరంటం అని చావులని పుట్టుకలని చెప్పా చెయ్యకుండా ఉండిపోతుంటారు. ఇక్కడ ఈ నరకం నేనూ నా పిల్లలు అనుభవించవలసి వస్తుంది. మహారాజులా మీకు భోజనం టైంకి ప్లేటులు ముందుకువస్తే చాలు!" అని చిరచిరలాడింది.

ఆఫీసు పనితో బుర్ర వేడెక్కిపోయి ఇల్లు చేరిన నాకు "ఏవిటీ సుత్తీ!- రాత్రికి ఆలోచిద్దాం" అంటుండగానే హడావిడిగా సైకిల్ దిగిన పైడిరాజు పాల చెంబు అందిస్తూ "అయ్యగోరూ ఓ ఐదు రూపాయలు అర్జెంటుగా ఇప్పించండి. మా కుర్రోడికి కడుపునొప్పి మందు కొనాలి!" అడిగాడు.

"లేవురా!"- వున్న ప్రతీవాడూ అనవలసినమాటే అన్నాను.

"కుర్రగుంటడు సచ్చిపోతాడు దొరా!" పొగిడాడు. ఐదు కాగితం అందించగానే పాలచెంబు వున్నదన్న ధ్యాస కూడా లేకుండా తుర్రుమన్నాడు.

సాయిబాబా మందిరంలో భజన మైకు ద్వారా వినబడుతోంది. ఆచార్యులగారు గుర్తుకు వచ్చి శ్రీమతితో "ఆచార్యులుగారు వస్తానని అన్నారు వచ్చారా?"- అడిగాను.

"రాలేదు. గీతోపదేశం ఎవరికో చదివి వినిపిస్తున్నారట. ఇప్పటిలో ఆయనకి తీరిక ఉండదు"-అన్నది.

'ఛఛ! ఆయన వచ్చినా కాస్త కాలక్షేపం జరిగేది!' ఫోను డైల్‌చేసి మూర్తిగారిని రమ్మన్నాను. ఏదో అర్జెంటు పని మీద వెళ్లారని, రాత్రి తొమ్మిదింటి వరకూ ఇంటికే రారని ఆయన భార్య చెప్పింది. చిరాకు వేసింది. బాగా ఆలోచించాను. చాలా దినాలకు రిలీఫ్ దొరికింది. సినిమా చూసి చాలా దినాలయ్యింది, పేపరుతీసి చూశాను. మిలాపీలో ఇంగ్లీష్‌పిక్చర్. పిక్చర్ టైటిల్ ఆకర్షించలేదు. ముచ్చటగా వ్రాసిన పదాలు చూసితీరాలన్నంత కోరికని కలిగించాయి.

శ్రీమతితో అన్నాను. "త్వరగా బట్టలు మార్చుకో. మిలాపీలో బ్రహ్మాండమైన ఇంగ్లీషుపిక్చరు రిలీజయ్యింది ఈ దినమే" అంటూ పేపరులో స్లయిడుని చూపించాను.

"ఇంగ్లీషు పిక్చరా? ఛఛ! పాడు సినిమా బొత్తిగా గుడ్డలు వుండవు. అయినా వయసొచ్చిన పిల్లలని ఇంట్లోపెట్టుకుని ఏమిటీ వెధవ వేషాలు" కస్సుమన్నది.

"లాభం లేదు మేడమ్!....ఇంకా పది నిముషాలే ఉంది. ప్రొప్రయిటర్‌కి ఫోను చేసి టిక్కెట్లు రిజర్వ్ చేయించేశాను." బలవంతంగా బట్టలు మార్పించాను.

హాలు చేరేసరికి లైట్లు ఆరిపోయి న్యూస్ చూపిస్తున్నారు. శ్రీమతి లోలోన చిర్రుబుర్రులాడుతున్నా సమర్థిస్తూ కూర్చోబెట్టి కూర్చున్నాను బాల్కనీలో.

పద్ధతి ప్రకారం న్యూస్ వెంటనే చక్ చక్ మంటూ ట్యూబ్ లైట్లు వెలిగాయి. క్రిందికి వొంగి ఎదురుగా చూశాను.

అంతే కళ్ళు వచ్చగా అంటుకున్నట్లు అయ్యాయి. పిల్లలకి పాఠాలు చెప్పవలసిన ప్రయివేట్ టీచర్, గీతోపదేశం చేయిస్తున్న ఆచార్యులుగారు, మొక్కలకి నీళ్ళు పోయవలసిన గంగయ్య, వంటమనిషి నీలాలు, కుర్రకుంకకి కడుపు నొప్పి మందుకని ఐదు రూపాయలు పుట్టించుకొని వెళ్ళిన పాలవాడు శనక్కాయలు తింటూ ముసిముసిగా నవ్వుకొని ఏవేవో చెప్పుకుంటున్నారు.

గుడ్- అందరికీ ఒకే అవసరం వొచ్చిందనుకున్నాను.